క్లుప్తంగా

వ్యవసాయాధికారిగా రఖీబా



గంగవరం: మండల వ్యవసాయాధికారిగా రఖీబా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పెద్దపంజాణి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న హేమలత పంజాణికి బదిలీపై వెళ్లారు. రఖీబా మాట్లాడుతూ, మండలంలో రైతాంగం సమస్యల పరిష్కారానికి, రైతుల శ్రేయస్సు కోసం కృషి చేస్తామన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా రెడ్డి ప్రదీప్



రొంపిచెర్ల: స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా రెడ్డి ప్రదీప్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ప్రిన్సిపాల్ సరళను తిరుపతి జిల్లా ఎర్రావారిపాళ్యం మండల ఆదర్శ పాఠశాలకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అన్నమయ్య జిల్లా కేవీ పల్లె ఆదర్శ పాఠశాల నుంచి రెడ్డి ప్రదీప్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. అయన మాట్లాడుతూ, ఆదర్శ పాఠశాల అభివృద్ధికి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని, ఈ దిశగా ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఇదలా ఉంచితే, ఆదర్శ పాఠశాలలో మరో ఎనిమిది మంది ఉపాధ్యాయులు కూడా వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం



నాగరాజును అభినందిస్తున్న పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి

పలమనేరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్టీ నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర పదవినిచ్చిన పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌సుందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో కుప్పం జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం, ప్రిన్సిపాల్

కుప్పం రూరల్: నీట్ -2025 ఫలితాల్లో కుప్పం జూనియర్ కళాశాల (కేజేసీ) విద్యార్థులు ప్రతిభ కనబరచారని చైర్‌పర్సన్ శాంతానాగరాజు తెలిపారు. శంకర్ 548/720 మార్కులు, రంజిత్ 513/720, అను 489/720 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీట్లు కైవసం చేసుకున్నట్లు శాంతానాగరాజు తెలిపారు. విద్యార్థులకు యాజమాన్యం, ప్రిన్సిపాల్ ఎంబీ సుప్రియ అభినందించారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం



మోటుమల్లెల నగిరిలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

రొంపిచెర్ల: మండలంలోని మోటుమల్లెల నగిరిలో అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా ఉంది. మోటుమల్లెల నగిరిలోని ప్రాథమిక పాఠశాలలో 20 ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. అయితే నాలుగేళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం నిర్మించి ఇవ్వాలని పిల్లల తల్లిదండ్రులు అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అయన ప్రభుత్వం నుంచి రూ.8.50 లక్షలు మంజూరు చేయించారు. దీంతో అధికారులు పనులు చేపట్టారు. అయితే 80 శాతం పనులు పూర్తి చేసినా బిల్లులు ఇవ్వకపోవడంతో భవన పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు నిధులు మంజూరు చేసి, అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి, అంగన్‌వాడీ భవనాన్ని వినియోగంలోకి తీసుకుని రావాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మోటుమల్లెల నగిరి ప్రాథమిక పాఠశాలలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

బడుల విలీనం.. గ్రామాల్లో పోరాటం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తోంది. ఆయా గ్రామాల్లోని బడులను పొరుగు గ్రామాల్లోని ఎక్కువ పిల్లలున్న చోట్లకు విలీనం చేసి వాటిని మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చింది. ఇందులోనూ విలీనం చేసిన బడుల్లోని 3,4,5 తరగతుల పిల్లలను మాత్రమేనని మెలిక పెట్టింది. మిగిలిన 1,2 తరగతులను ఫౌండేషన్ స్కూళ్లుగా మార్చి వీటిల్లోకి అంగన్‌వాడీ సెంటర్లను కలపనున్నట్లు తెలుస్తోంది. స్కూళ్ల విలీనంపై గ్రామాల్లో తల్లిదండ్రులు ప్రభుత్వంపై భగ్గుమంటున్నారు. పలుచోట్ల ఆందోళనలు సైతం చేస్తున్నారు.

- పక్క గ్రామాలకు పిల్లలను పంపమంటున్న తల్లిదండ్రులు
- రవాణా సౌకర్యాల లేమి, భద్రతపై ఆందోళన
- ఎక్కువమంది ఉన్న బడికి మిగిలిన రెండు స్కూళ్ల పిల్లలు
- ప్రైమరీ బడులను ఫౌండేషన్ స్కూల్స్, ఎంపీఎస్‌లుగా విడదీత
- గ్రామాల్లో గందరగోళంగా మారిన విలీన ప్రక్రియ
- మూడు నియోజకవర్గాల్లో 139 బడుల విలీనం
- అత్యధికంగా చౌడేపల్లె మండలంలోనే 30 విలీనం!

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థ అస్తవ్యస్తం చేస్తోంది. సజావుగా సాగుతున్న స్కూళ్లను విలీనం పేరిట పిల్లల తల్లిదండ్రులకు కంటికి కనుకులేకుండా చేస్తోంది. పలు మండలాల్లో రెండు, మూడు కిలోమీటర్లలోని పక్క గ్రామానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు లేవు. దీంతో చిన్నపిల్లలను ఆ గ్రామాల స్కూళ్లకు ఎలా పంపేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఫలితంగా చాలామంది ప్రభుత్వ బడులకు గుడ్‌బై చెప్పేస్తున్నారు. మళ్లీ ప్రైవేటు స్కూళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. గ్రామాలకు వచ్చే ప్రైవేటు వ్యాన్లలో స్కూళ్లకు పిల్లలను పంపే యోచనలో ఉన్నారు. విలీన పొరబాట్లపై ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు పూనుకోకపోతే ఈ విద్యా సంవత్సరంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గుముఖం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇదిగో సాక్ష్యం



విలీనం వద్దని బైరెడ్డిపల్లె మండలం మూగనపల్లె ప్రాథమిక పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు(ఫైల్)

బైరెడ్డిపల్లె మండలంలోని మూగనపల్లె ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతుల్లో 30మంది విద్యార్థులున్నారు. ఇక్కడ పిల్లల సంఖ్య తక్కువగా ఉందని 2 కిలోమీటర్లలోని నాచుకుప్పం బడికి విలీనం చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం పిల్లలు నడిచిరావడంతో ప్రమాదాలు తప్పవని తల్లిదండ్రులు ఆందోళన చేశారు. విలీన ప్రక్రియకు స్వస్తి పలకాలని, లేదంటే తమ పిల్లల్ని పక్క గ్రామానికి పంపేది లేదని తేల్చి చెప్పారు.

పలమనేరు మండలంలో ఇలా...

ఈ మండలంలో ఏ గ్రామానికీ బస్సు సౌకర్యం లేదు. అయ్యంరెడ్డిపల్లె, గజ్జలవారిపల్లె, కోతిగుట్ట, పందేరుపల్లె వడ్డూరు, పాలమాకులపల్లె గ్రామాలు ఎక్కడో విసిరేసినట్లు ఉంటాయి. ఈ గ్రామాలకు వెళ్లాలంటే కనీసం ఆటోలు కూడా లేవు. ద్విచక్ర వాహనాల్లోనే రాకపోకలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ గ్రామాల విద్యార్థులకు రెండు కిలోమీటర్ల దూరంలోని బడులకు ఎలా పంపేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

విలీనం అయిన బడుల వివరాలిలా...

పలమనేరు నియోజకవర్గంలో మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 410 వరకూ ఉన్నాయి. వీటిల్లో విలీనం పేరిట పలమనేరు మండలంలో 9, బైరెడ్డిపల్లెలో 7, గంగవరంలో 16, వీ.కోటలో 17, పెద్దపంజాణిలో 2 ఉన్నాయి. కుప్పం నియోజకవర్గంలో రామకుప్పం, శాంతిపురంలో తొమ్మిది స్కూళ్లు ఉన్నాయి. ఇక పుంగనూరు నియోజకవర్గంలో అత్యధికంగా చౌడేపల్లె మండలంలో 30, పుంగనూరులో 23, సదుంలో రెండు, సోమల 12, రొంపిచెర్లలో ఒకటి చొప్పున ఉన్నాయి. విలీనమైన స్కూళ్ల 3,4,5 తరగతుల పిల్లల్ని పక్క గ్రామాల్లోని బడుల్లోకి కలిపారు.

విలీనం..'ప్రైవేటు' సంబరం

గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు విలీనం మూలాన ఇతర గ్రామాల్లోని స్కూళ్లకు రవాణా సౌకర్యాల లేమి, పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రధానంగా ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒకింత ఫీజుల భారమైనప్పటికీ ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేట్ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పడానికి మొగ్గు చూపుతున్నట్టు కొందరు చెప్పారు. తగిన ఆర్థిక స్తోమతలేని వారు తమ పిల్లలను స్కూళ్లను మానిపించడం మినహా గత్యంతరం లేదని పేర్కొంటున్నారు. మొత్తానికి ప్రభుత్వ చర్యల పుణ్యమా అని తమకు మళ్లీ మంచిరోజులొస్తున్నాయని ప్రైవేటు స్కూళ్లు సంబరపడుతున్నాయి.

తల్లిదండ్రుల బాధను అర్థం చేసుకోవాలి



మా ఊరిలో పిలకాయలను నాచుకుప్పంలోని బడికి పంపాలట! మా ఊర్నుంచి ఆ ఊరికి రోడ్డు సరిగా లేదు. చిన్న పిల్లలు నడిచి అంత దూరం ఎట్లా పొయ్యొచ్చేది? అందరికీ బైకులుండవు కదా? ప్రతిరోజూ తల్లిదండ్రులకు ఓ గండంలా బతకాలి. పిలకాయలు భద్రంగా ఉండాలనే ఏ తల్లిదండ్రులైనా చూస్తారు. ఇప్పుడు విలీనంతో ప్రభుత్వం చిచ్చు పెట్టింది. తల్లిదండ్రులు పిల్లలను స్కూళ్లు మాన్పించి వాళ్ల దారి వాళ్లు చూసుకుంటారు.

–నారాయణస్వామి, మూగనపల్లె

జల్లి టిప్పర్లు వెళ్లే మార్గంలో పిల్లలను పంపలేం



మా ఊరి బడిలో 30మంది పిల్లలున్నారు. మా బడిని 2 కిలోమీటర్ల దూరంలోని కల్లాడు బడికి విలీనం చేశారు. అక్కడికి పిల్లలను పంపాలంటే నిమిషానికో జల్లి టిప్పరు వేగంగా వస్తుంటాయి. మధ్యలో ఎక్స్‌ప్రెస్ హైవే వద్ద వరదనీరు చెరువులా ఉంది. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో పిల్లల్ని అక్కడికి పంపలేం.

–వెంకటేష్, పాలమాకులపల్లె

విలీనం చేయాలని ఆదేశాలు



ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యను బట్టి మూడు బడుల్లో తక్కువగా ఉన్న రెండు బడులను హాజరు ఎక్కువగా ఉన్న బడికి విలీనం చేయాలని ఆదేశాలందాయి. వీటిని 1 ప్లస్ 4 మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా పిలుస్తారు. 1,2 తరగతులను ఫౌండేషన్ స్కూళ్లుగా మార్పుచేశారు. ఆదేశాలను పాటించడం తప్పనిసరి. –లీలారాణి, ఎంఈఓ, పలమనేరు

నోటీస్ బోర్డు

- నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చౌడేపల్లె:స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. చెన్నై ఎంఎన్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షిస్తారని, అవసరమైన రోగులను చెన్నైకు తీసుకెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుక్కులు దున్ని వర్షం కోసం ఎదురుచూపులు



కమ్మపల్లె వద్ద సిద్ధం చేసిన దుక్కులు

పులిచెర్ల(కల్లూరు): ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాధార పంటగా వేరుశనగ సాగు చేయడానికి రైతులు దుక్కి దున్ని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. మేఘాలు ఆకాశంలో దోబూచులాడటం తప్పితే చినుకు మాత్రం పలకరించడం లేదు. వర్షం కురిస్తే వేరుశనగ విత్తనాలు వేయడానికి రైతులు నిరీక్షిస్తున్నారు. మంచి అదును కావడంతో ఇప్పుడు వేస్తే మంచి దిగుబడి వస్తుందనే ఆశాభావంతో ఉన్నారు. మరోవైపు మండలంలో ఎక్కువ మామిడి సాగు కావడంతో ఉన్న కొద్ది పొలంలోనైనా సాగు చేద్దామంటే పందులు, ఏనుగుల బెడద ఎక్కువగా ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు 750 ఎకరాల్లో వేరుశనగ సాగు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

కూటమి పాలనలో మహిళలకు భద్రత లేదు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా కన్వీనర్ భువనేశ్వరి

పలమనేరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోనే మహిళలకు రక్షణ, భద్రత లేదని శిరీష ఉదంతం చాటిచెప్పిందని, ఇక్కడ ఏ ఇంతటి అమానుష ఘటన జరిగితే, ఇక రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంటోందో ఇట్టే అర్థం చేసుకోవచ్చని ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. కుప్పంలో శిరీష ఉదంతంపై బుధవారం స్థానిక పలమనేరులో కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు తూతూమంత్రంగా అరెస్టులు చేయడం తప్పితే కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ కారణంగా నిందితులకు ఏమాత్రం భయం లేకుండా పోతోందన్నారు. బాధితురాలికి రూ.5లక్షలిచ్చి ఆమెను ఫోన్‌లో పరామర్శించినంత మాత్రాన ఇలాంటి సమస్యలకు పరిష్కారం లభించదన్నారు. కుప్పం నియోజకవర్గంలోని కొన్ని ఊర్లలో అప్పులిచ్చి, రాబందుల్లా పీడిస్తున్న వారెందరో ఉన్నారని, వారి వేధింపులు తట్టుకోలేక ఊర్లను వదిలిపోయిన వారూ ఉన్నారన్నారు. ఆ ఊర్ల గురించి ఈ మధ్యన కొన్ని పత్రికల్లో పతాక శీర్షికల్లో కథనాలు వచ్చినా ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదన్నారు. శిరీషను చెట్టుకు కట్టేసి, వేధించిన వైనం వైరల్ కావడంతోనే ప్రభుత్వం కదలిందని, ఇలాంటి శిరీష లాంటి అభాగ్యులెందరో ఉన్నారని, ఇకనైనా కుప్పం నియోజకవర్గంలో అప్పులిచ్చి వేధిస్తున్న గ్రామాలపై ప్రభుత్వం దృష్టి సారించి, కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా శిరీషకు రక్షణ కల్పించి, ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఓబుల్‌రాజు, ఈశ్వర్ పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీ చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు, విద్యార్థినులు

పలమనేరు: పట్టణంలో బుధవారం 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవ ర్యాలీ వేడుకగా నిర్వహించారు. వీహెచ్‌పీ, హిందూ సంఘాలు, పలు కళాశాలల విద్యార్థినులు, ఆర్య వైశ్య మహిళలు జాతీయ పతాకాలతో ఈ ర్యాలీ చేశారు. భారత్ మాతాకీ జై అంటూ దారి పొడవునా నినాదాలు చేస్తూ భారత్ త్రివిధ దళాల శక్తిని కీర్తించారు. అనంతరం ఓ కళ్యాణ మండపంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి చెందిన మిలటరీ సిద్దయ్య ఆపరేషన్ సిందూర్ విజయంపై మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు పట్టణవాసులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 126 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ప్రసంగిస్తున్న హిందాల్కో సంస్థ ప్రతినిధి వెన్నెల



మేళాకు హాజరైన విద్యార్థులు

శాంతిపురం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. 126 మంది శిక్షణ పొందిన విద్యార్థులను వివిధ కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నాయని ప్రిన్సిపాల్ ఐ.శేషారెడ్డి తెలిపారు. మొత్తం 160 మంది పూర్వ విద్యార్థులు మేళాకు హాజరయ్యారని చెప్పారు. హిందాల్కో, సైబర్ డైనమిక్స్, సాహి ఎక్స్‌పోర్ట్స్, అమరరాజా, ఆంపినల్ సంస్థల ప్రతినిధులు మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్లు హితేంద్రకుమార్, కళ్యాణ్‌కుమార్, ఐటీఐ సిబ్బంది జోగేందర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పక్వానికి రాని మామిడి కాయలు కోయొద్దు

- రైతులతో ఏడీఏ శివకుమార్



'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏడీఏ శివకుమార్, ఏఓ, రైతులు

గంగవరం: తోతాపురి మామిడి కిలోకి రూ.4 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని, పక్వానికి వచ్చిన మామిడి కాయలకు మాత్రమే ఈ ధర పలుకుతుందని పుంగనూరు ఏడీఏ శివకుమార్ తెలిపారు. మండలంలోని కుర్నిపల్లెలో బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. గ్రామ పరిసరాల్లోని మామిడి తోపులను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. పక్వానికి రాని మామిడి కాయలు కోయవద్దని రైతులకు సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మామిడికాయలను ఆగస్టు నెలాఖరు కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. ఇక, ఖరీఫ్ 2025 సీజన్‌లో సాగు చేసే పంటల సస్యరక్షణ, విత్తన శుద్ధి, కలుపు మందులు గురించి తొలుత రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవయాధికారిణి రఖీబా, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేటు పతనం.. మామిడి దైన్యం

మామిడి కాయలు కొనేది లేదు..ఎక్కడైనా అమ్ముకోండి..మా మండీలో మేము కొనం' అని మండీ వ్యాపారులు రైతులకు తేల్చి చెబుతుండడంతో మామిడి రైతుల దిక్కుతోచడం లేదు. నానాబాధలు పడి కాయలు కోసి మామిడి గుజ్జు పరిశ్రమలకు తీసుకెళితే అక్కడ కొనడం లేదు. స్థానికంగా ఎలాగో విక్రయిద్దామని మండీలకు వస్తే వ్యాపారులు నిష్కర్షగా చెబుతుండడంతో మామిడి రైతులు నిండా మునిగిపోతున్నారు.

- కిలో 3 రూపాయలకూ అమ్ముడుపోని మామిడి
- మండీల్లో మరుగుతున్న మామిడి బస్తాలు
- కొనడానికి ముందుకురాని బయటి వ్యాపారులు
- తోతాపురిని తీసుకురావద్దంటున్న వైనం
- ర్యాంపుల వ్యాపారానికి చొరవ చూపని వ్యాపారులు
- ఇదీ పలమనేరు ప్రాంతంలో మామిడి రైతుల దీనావస్థ



మామిడి కాయలు కొనకపోవడంతో నిరాశగా కూర్చున్న రైతులు

పలమనేరు: నియోజకవర్గంలో మామిడి తోటలు 12వేల ఎకరాల్లో ఉన్నాయి. ఏటా వీటిలో దిగుబడి 50వేల టన్నుల వరకూ ఉంటుంది. గతంలో కాయలను ఫ్యాక్టరీలకు, స్థానిక మండీలకు, తోటలమీదే వ్యాపారులకు విక్రయించేవారు. ఈ పర్యాయం మామిడిని కొనేవారే లేకుండాపోయారు. దీంతో రైతులు తోటల్లోని కాయలను ఎలా అమ్ముకోవాలో అర్థంకాక ఆందోళన చెందుతున్నారు.



బయటి వ్యాపారులు రాక బస్తాల్లో మగ్గుతున్న మామిడికాయలు

పడిపోయిన ధరలు

స్థానిక మామిడి మండీల్లో నాటు రకాలను కిలో రూ.3 కూడా కొనడం లేదు. కొన్న కాయలను బస్తాల్లో నింపి, బయటి వ్యాపారుల కోసం మండీ యజమానులు వేచి చూస్తున్నా అమ్ముడు పోవడం లేదు. దీంతో మండీల వద్ద బస్తాల కొద్దీ మామిడి కాయల మగ్గిపోయే పరిస్థితి కలిగింది. ముఖ్యంగా తోతాపురి అంటే మండీలకే తేవద్దని ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు.

ర్యాంపులకు ముందుకురాని వ్యాపారులు



ర్యాంపులు కట్టినా మొదలు కాని వ్యాపారం

పట్టణంలో మూడు ర్యాంపులకు హార్టికల్చర్ అధికారులు అనుమతులను ఇచ్చారు. దీంతో వ్యాపారులు పట్టణ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ర్యాంపుల నిర్మాణాన్ని చేపట్టారు. కానీ మామిడి కాయలను మాత్రం కొనడం లేదు. ఈ ర్యాంపుల వద్ద రైతుల నుంచి మామిడి కాయలను కొనుగోలు చేయాలని అధికారులు భావించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సచివాయలయంలోని హార్టికల్చర్ అసిస్టెంట్లను వీటికి పర్యవేక్షకులుగా ఏర్పాటు చేశారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన కొత్తగా కట్టిన ర్యాంపుల వద్ద అసలు వ్యాపారాలే మొదలు కాలేదు!

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

రొంపిచెర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పెద్దమల్లెల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లలో చేరితే రూపాయి ఖర్చు లేకుండా చదువుకోవచ్చన్నారు. ప్రభుత్వం పాఠ్య, నోటు, పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు ఇచ్చి మధ్యాహ్నం భోజనం పథకాన్ని అమలు చేస్తుందన్నారు. దీనిని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎర్రయ్య, ఉపాధ్యాయులు హరి, మనోహర్, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రేమానందం, చిన్న రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

32 మంది టీచర్లు బదిలీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలో 32 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య తెలిపారు. ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 20 మంది, హైస్కూళ్ల నుంచి 12 మంది ఇతర మండలాలకు బదిలీ అయ్యారని ఎంఈఓలు చెప్పారు.